క్లుప్తంగా

గ్రామాల్లో ట్యాంకర్లతో నీటి సరఫరా



గొర్విమానుపల్లెలో ట్యాంకర్ వద్ద నీరు పట్టుకుంటున్న గ్రామస్తులు

కొలిమిగుండ్ల: గ్రామాల్లో నీటి ఎద్దడి ఏర్పడింది. ప్రజలు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజల దాహార్తి తీర్చేందుకు అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ ముందుకొచ్చింది. కంపెనీ పరిధిలోని గ్రామాలైన గొర్విమానుపల్లె, పెట్నికోట, బందార్లపల్లె, అంకిరెడ్డిపల్లె గ్రామాల్లో ట్యాంకర్లతో నీటి సరఫరా అందిస్తున్నామని కంపెనీ యూనిట్ హెడ్ సజేంద్రకుమార్ ఆదివారం తెలిపారు. బందార్లపల్లె, పెట్నికోటలో ఒక ట్యాంకర్, గొర్విమానుపల్లె, అంకిరెడ్డిపల్లెలో రెండు ట్యాంకర్ల చొప్పున నీటి సరఫరా కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. వేసవి ముగిసే వరకు నీటి సరఫరా అందిస్తామని చెప్పారు.

మొక్కజొన్న పంట దగ్ధం



కాలిపోయిన మొక్కజొన్న పంట

ప్యాపిలి: మండల పరిధిలోని మాధవరం గ్రామంలో ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో మొక్కజొన్న పంట దగ్ధమైంది. గ్రామానికి చెందిన రైతు శ్రీరాములు తనకున్న రెండు ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశాడు. ఆదివారం ప్రమాదవశాత్తు నిప్పు అంటుకోవడంతో పంట మొత్తం అగ్నికి ఆహుతైంది. ప్రమాదంలో సుమారు రూ. 2 లక్షల వరకు నష్టం వాటిల్లిందని రైతు వాపోయాడు.

వివాహ వేడుకలో కాటసాని



వధూవరులతో కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె రూరల్: బెంగళూరులోని మూన్ గేట్ ఈవెంట్స్‌లో ఆదివారం బనగానపల్లె పట్టణానికి చెందిన నల్లగట్ల వెంకటేశ్వర్లు కుమారుడి వివాహం జరిగింది. బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నేత కాటసాని తిరుపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వక్ఫ్ సవరణకు వ్యతిరేకంగా పోరాడుతాం



ముస్లిం న్యాయవాదులు

బనగానపల్లె రూరల్: బనగానపల్లె జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో ఆదివారం పలు ముస్లిం మైనార్టీ న్యాయవాదుల సమావేశం జరిగింది. న్యాయవాదులు అబ్దుల్‌ఖైర్, ఖాజాహుస్సేన్ మాట్లాడుతూ.. కేంద్రం చేసిన వక్ఫ్ బిల్లు సవరణకు వ్యతిరేకంగా పోరాటాలు, ఉద్యమలు, న్యాయ పోరాటలు చేసేందుకు త్వరలో బనగానపల్లెలో ముస్లిం న్యాయవాదుల ఫోరం ఏర్పాటు చేస్తామన్నారు. న్యాయవాదులు బాబావలి, వహీద్, జాకీర్‌హుస్సేన్, జూనెద్, మక్బుల్, సయ్యద్‌మొహిద్దీన్, హుస్సేన్‌బాషా, అలీబేగ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి



మృతి చెందిన మహమ్మద్‌ముక్తియ

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని జాతీయ రహదారిపై దొరపల్లె జగనన్న కాలనీ వద్ద ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్ణాటక రాష్ట్రం కునేగల్‌కు చెందిన మహమ్మద్ ముక్తియ (45)అనే లారీ డ్రైవర్ మృతిచెందాడు. కర్నూలు నుంచి బెంగళూరు వైపునకు వెళుతున్న పార్శిల్ మినీ లారీ తెల్లవారు జామున ముందు వెళుతున్న గుర్తు తెలియని వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో మినీ లారీ డ్రైవర్ మహమ్మద్ ముక్తియ క్యాబిన్‌లో ఇరుక్కొని మృతి చెందగా క్లీనర్ చంద్ర శేఖర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ మేరకు క్లీనర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు డోన్ సీఐ ఇంతియాజ్‌బాషా తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

డోన్: ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ కార్యదర్శి భానుసింగ్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో పెన్షనర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. హెల్త్‌కార్డులు, మెడికల్ రీఎంబర్స్‌మెంట్ రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంపు, అడిషనల్ క్వాంటం పునరుద్ధరణ తదితర డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. సంఘం కార్యదర్శి గాలయ్య, సుబ్బరాయుడు, కోశాధికారి గోపాల్ పాల్గొన్నారు.

జాప్యం.. నైరాశ్యం

- లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునరుద్ధరణ పనుల్లో జాప్యం
- బ్రహ్మోత్సవాల నిర్వహణపై నీలినీడలు
- ఉత్సవాలు చేయకపోవడంతో భక్తుల్లో నైరాశ్యం
- చివరిసారి 2018లో నిర్వహణ



అశేష భక్తజనం మధ్య రథోత్సవం (ఫైల్)



నిర్మాణంలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయం

కొలిమిగుండ్ల: స్థానిక కొండపై శ్రీకృష్ణదేవరాయల కాలంలో నిర్మించిన శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలపై నీలి నీడలు కమ్ముకున్నాయి. ఈఏడాదైనా ఉత్సవాలు జరుగుతాయని భక్తులు కోటి ఆశలు పెంచుకున్నారు. ప్రస్తుతం అవకాశం లేకపోవడంతో నైరాశ్యంలో మునిగిపోయారు. ఏటా వైశాఖ మాసంలో శ్రీదేవి, భూదేవి సమేతంగా లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు జరుపుకోవడం ఏన్నో ఏళ్ల నుంచి ఆనవాయితీగా వస్తోంది. ఏటా పది రోజుల పాటు ఉత్సవాలు కనుల పండువుగా జరిగేవి. రోజుకో వాహన సేవలో స్వామి భక్తులకు దర్శనమిస్తుండేవారు. చుట్టు పక్కల గ్రామాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి ఉత్సవాలను తిలకించేందుకు భక్తులు వచ్చేవారు. కొలిమిగుండ్ల, అవుకు, కోవెలకుంట్లలో ఒకేసారి ఉత్సవాలు మొదలవుతుంటాయి. ఆ ప్రాంతాల్లో ఇప్పటికే ఏర్పాట్లు మొదలుపెట్టారు. కొలిమిగుండ్లలో మాత్రం ఇప్పటి వరకు ఉత్సవాల నిర్వహణపై ఒక్క అడుగు ముందుకు పడకపోవడంతో ఈసారి సైతం జరగవని భక్తులు నిరాసతో ఉన్నారు.

ఆరేళ్లుగా ఉత్సవాలకు బ్రేక్

ఆనవాయితీ ప్రకారం నిర్వహిస్తున్న ఉత్సవాలు 2018లో చివరిసారిగా జరిగాయి. ఆ ఏడాది రథం చక్రాలు దెబ్బతినడంతో అప్పటి ఎమ్మెల్యేగా ఉన్న బీసీ జనార్దనరెడ్డి దెబ్బతిన్న చక్రాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయించారు. రథోత్సవం చేశాక చక్రాలు ఒక్కసారికే దెబ్బతిన్నాయి. దీంతో 2019లో చక్రాలు సరిగ్గా లేని కారణంగా ఉత్సవాలకు బ్రేక్ పడింది. 2020లో అనూహ్యంగా కరోనా రావడంతో ఉత్సవాలు ఆగిపోయాయి. 2021లో ఎట్టకేలకు రాతి చక్రాల స్థానంలో దాతల సహకారంతో ఐరన్‌తో చక్రాలు చేయించినా.. కరోనా సెకండ్ వేవ్‌తో అప్పుడు ఆగిపోవాల్సి వచ్చింది. 2022లోకి వచ్చే సరికి రామ్‌కో సిమెంట్ కంపెనీ రూ.7కోట్లతో ఆలయాన్ని జీర్ణోద్ధరణ చేసేందుకు ముందుకొచ్చింది. పనుల్లో భాగంగా గర్భగుడి, గాలిగోపురం, ప్రహరీ తదితర నిర్మాణాలు పడగొట్టారు. ఇలా పలు కారణాలతో స్వామి ఉత్సవాలు జరగకుండా పోయాయి.

నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం

పురాతన ఆలయానికి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు రామ్‌కో కంపెనీ కృషి చేయడంతో భక్తులు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. అయితే నిర్మాణ పనుల్లో ఎక్కడా లేని జాప్యం చోటు చేసుకుంది. ఈ జాప్యం వల్లే ఉత్సవాలు జరగకుండా ఆలస్యమవుతున్నాయని భక్తులు ఆరోపిస్తున్నారు. గర్భగుడి పునరుద్ధరణ, విశాలమైన ప్రహరీ నిర్మాణం, ఐదు అంతస్తుల గాలి గోపురం తదితర పనులు పూర్తి చేశారు. ప్రస్తుతం 70 శాతం పనులు పూర్తయ్యాయి. ఎలాగైనా ఈసారి ఉత్సవాల నాటికి ఆలయాన్ని పూర్తి చేస్తామని గతంలో రామ్‌కో ప్రతినిధులు చెప్పినా ఆచరణలో జరగలేదు. ప్రస్తుతం ఉత్సవాల నిర్వహణకు సరిపడా సౌకర్యాలు కొండపై ఉన్నాయి. అంత కంటే ముందుగా మూడు రోజుల ప్రత్యేక పూజల్లో భాగంగా ధ్వజస్తంభ ప్రతిష్ట, విశేష పూజలు నిర్వహించి ప్రాణ ప్రతిష్ట చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాతనే ఉత్సవాలకు అంకురార్పణ జరగాల్సి ఉంది. అన్ని సవ్యంగా జరిగితే మే 9వ తేదీ నుంచి 19 వరకు ఈఏడాది ఉత్సవాలు జరుపుకునేందుకు అవకాశం ఉంది. ప్రస్తుతం ఉన్న పరిణామాలను బట్టి స్వామి ఉత్సవాలను తిలకించే భాగ్యం లేనట్లే అని భక్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

వాటర్ వర్కర్స్‌కు వేతనాల చెల్లింపు

ప్యాపిలి: ఆరు నెలల నుంచి వేతనాలు అందక సమ్మెలోకి వెళ్లిన వాటర్ వర్కర్స్‌కు కాంట్రాక్టర్ ఎట్టకేలకు మూడు నెలల వేతనాలు చెల్లించారు. వేతనాల కోసం వాటర్ వర్కర్స్ ఇబ్బందులు పడుతున్నట్లు పత్రికల్లో కథనాలు ప్రచురితం కావడంతో కాంట్రాక్టర్ స్పందించాడు. మూడు నెలల వేతనాలు అందడంతో వాటర్ వర్కర్స్ విధుల్లోకి చేరారు. నంద్యాల నీటి పథకం ద్వారా ప్యాపిలి పట్టణానికి నీటి సరఫరా చేస్తున్నారు. మరో మూడు నెలల వేతనాలు త్వరలోనే చెల్లిస్తానని కాంట్రాక్టర్ హామీ ఇవ్వడంతో విధుల్లోకి చేరినట్లు వాటర్ వర్కర్స్ తెలిపారు.

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలు

సంజామల: మండలంలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి పూట తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. సంజామల, ఆకుమల్ల, పేరుసోముల, నొస్సం సబ్‌స్టేషన్‌ల పరిధిలోని ముక్కమల్ల, ఆల్వకొండ, రెడ్డిపల్లె, వసంతాపురం, కమలపూరి, ముదిగేడు, కానాల, అక్కంపల్లె, గిద్దలూరు, ఆర్.లింగందిన్నె, రామిరెడ్డిపల్లె, మిక్కినేనిపల్లె గ్రామాలకు ఉదయం 7.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఏఈ వివరించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నివాళులర్పిస్తున్న బుగ్గన అర్జున్ రెడ్డి

ప్యాపిలి: పట్టణంలోని హుసేనాపురం వీధిలో నివాసం ఉంటున్న వ్యాపారవేత్తలు షేక్షా, షాషాల సోదరుడు షేక్ సాదిక్ వలి (36) శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తనయుడు బుగ్గన అర్జున్ అమర్నాథ్ రెడ్డి ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, సాదిక్ మృతదేహం వద్ద నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

వివాహ వేడుకలో..

డోన్: స్థానిక సాయిశ్రీ ఫంక్షన్‌హాల్‌లో వైఎస్సార్‌సీపీ నేత, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు కుమ్మరిరాజు కుమారుని వివాహానికి బుగ్గన అర్జున్‌రెడ్డి ఆదివారం హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, జిల్లా వలంటీర్ విభాగం అధ్యక్షుడు పోస్టు ప్రసాద్, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, వైస్‌చైర్మన్ జాకీర్‌హుసేన్, నాయకులు సోమేష్ యాదవ్, మల్లికార్జునరెడ్డి ఉన్నారు.

జూనియర్ అసిస్టెంట్‌పై చీటింగ్ కేసు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో గతంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన చంద్రశేఖర్‌పై పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. వివరాలు.. గత ఏడాది సెప్టెంబర్ 3వ తేదీ బండిఆత్మకూరు మండలం లింగాపురానికి చెందిన సాయికృష్ణ అనే వ్యక్తికి ఆయన తల్లి శ్రీదేవి సర్వే నంబర్ 422/ఏ2లో ఉన్న 4.22 ఎకరాల భూమిని దాన విక్రయం ద్వారా కోవెలకుంట్ల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టర్ చేయించింది. అయితే ఈ సర్వే నంబర్ గల భూమి ఇదే గ్రామానికి చెందిన సంజన్న అనే వ్యక్తి పేరున ఉంది. ఈయన రెండేళ్ల క్రితం మృతి చెందాడు. మృతుని కుమారుడు శ్రీనివాస్ పొలం అనుభవంలో ఉన్నాడు. ఈ సర్వేనంబర్ పక్కనే శ్రీదేవి భర్త మోహన్‌రావుకు సంబంధించిన పొలం ఉంది. తన పొలం సర్వేనంబర్ సాకుతో బండి ఆత్మకూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కాకుండా కోవెలకుంట్ల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్‌తో రిజిస్టర్ చేయించారు. ఆ రోజున సబ్ రిజిస్టర్ సెలవులో ఉండడంతో వీరి పనిమరింత సులువుగా అయింది. ఎలాంటి డాక్యుమెంట్లు లేకుండా నకిలీ పన్ను రసీదు ఆధారంగా మోహన్‌రావు తన భార్య శ్రీదేవి ద్వారా కుమారుడు సాయికృష్ణకు దాన విక్రయ రిజిస్టర్ చేయించాడు. అప్పట్లో ఈ వ్యవహారం బయటకు తెలిసి సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. విషయం తెలుసుకున్న శ్రీనివాస్ ఈ ఏడాది జనవరి నెలలో పొలానికి సంబంధించి వివరాలు చెక్ చేసుకోగా అడంగల్‌లో తన తండ్రి పేరున పొలం లేకపోవడంతో ఆ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో విచారణ జరిపిన సబ్ రిజిస్ట్రార్ అధికారులు చంద్రశేఖర్‌ను కొంతకాలం క్రితం సస్పెండ్‌చేశారు. జూనియర్ అసిస్టెంట్ నిర్వాహంతోనే పొలం రిజిస్టర్ జరిగిందని బాధితుడు కోవెలకుంట్ల పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరుపుతున్నట్లు ఆదివారం రాత్రి ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు.

దాడి కేసు నమోదు

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్‌ఎస్ రంగాపురం గ్రామంలో పుట్టపాక వెంకటేశ్వర్లు అనే వ్యక్తి పైప్‌లైన్ వేస్తుండగా ఆ విషయంలో అదే గ్రామానికి చెందిన మహేశ్వర్‌రెడ్డి, మనోజ్, విమల గొడవపెట్టుకున్నారు. మాటమాట పెరిగి దాడి చేసి గాయపరిచారు. బాధితుడు వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

ప్యాపిలి: ప్యాపిలిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని బహుజన విద్యార్థి వేదిక జాతీయ అధ్యక్షుడు బీవీ రమణ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ద్వారా ఏటా సుమారు 100 మంది విద్యార్థులు ఇంటర్ పూర్తి చేస్తున్నారని తెలిపారు. అయితే స్థానికంగా డిగ్రీ కళాశాల లేకపోవడంతో ఆర్థిక స్తోమత లేని విద్యార్థులు ఇంటర్‌తోనే చదువు మానేస్తున్నారని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని కోరారు.

పేదింటి విద్యా కుసుమాలు



మౌనిక



గాయత్రి

బేతంచెర్ల: ఇంటర్ ఫలితాల్లో పట్టణానికి చెందిన మౌనిక ఎంపీసీ ఫస్ట్ ఇయర్‌లో 470 మార్కులకు గాను 457 మార్కులు సాధించి సత్తా చాటింది. తండ్రి లేకపోయినా తల్లి కూలి పనులకు వెళ్లి చదివిస్తోంది. ఆమె కష్టాన్ని వమ్ము చేయకుండా అత్యుత్తమ మార్కులు సాధించింది. అదే విధంగా పట్టణంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన పూజారి గాయత్రి ఎంపీసీలో 456 మార్కులు సాధించింది. ఆమె తండ్రి ఆటో డ్రైవర్ కాగా తల్లి కూలి పనులకు వెళ్తూ కుమార్తెను చదవిస్తున్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ట

సంజామల: మండల కేంద్రంలో పునర్నిర్మించిన ఖండేరాయస్వామి ఆలయంలో ఆదివారం సంప్రోక్షణ, ధ్వజస్తంభ ప్రతిష్ట నిర్వహించారు. మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు చేశారు. గణపతి, నందీశ్వర, ఆంజనేయ, సుబ్రమణేశ్వరస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. చివరి రోజు స్వామివార్లకు ప్రభాత పూజ, యంత్ర ప్రతిష్ట చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి గుండం సూర్యప్రకాష్‌రెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు.



ఖండేరాయస్వామి ఆలయంలో కొలువైన శివుడు

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం



బనగానపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు,



కోవెలకుంట్ల: మట్టలతో క్రైస్తవుల ర్యాలీ



బేతంచెర్ల: సిమెంట్ నగర్‌లో..

బనగానపల్లె రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో మట్టల ఆదివారాన్ని క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బనగానపల్లెలో సీఎస్‌ఐ టౌన్ చర్చి రెవరెండ్ దైవాదీనం ఆధ్వర్యంలో ఉదయం ఈతమట్టలను పట్టుకుని ఎస్‌బీఐ రోడ్డు, పోలీసు సర్కిల్ కార్యాలయం, ఆస్థానం రోడ్డు, పెట్రోల్ బంకు కూడలి మీదుగా చర్చి వరకు క్రైస్తవ గీతాలు పాడుతూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం చర్చలో ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సీఎస్‌ఐ సంఘ పెద్దలు ప్రసాద్, కరుణాకర్, శాంతమ్మ, సరోజమ్మసుందరం, మంజులామణి, నవీన్ పాల్గొన్నారు.

ఘనంగా మట్టల పండుగ

కోవెలకుంట్ల: పట్టణంలో మట్టల ఆదివారం సందర్భంగా ఆర్‌సీఎం చర్చి, గుళ్లదూర్తి సీఎస్‌ఐ చర్చిల్లో క్రైస్తవులు తాటి మట్టలు పట్టుకుని ఆయా కాలనీల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం చర్చిల్లో ప్రార్థనలు చేశారు. ఈ నెల 18వ తేదీ గుడ్ ఫ్రైడే, 20వ తేదీ ఈస్టర్ పండుగ నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఆయా చర్చిల పాస్టర్లు లూర్దు, గాబ్రియేలు, జయరాజు, ప్రేమ్‌సాగర్‌బాబు పాల్గొన్నారు.

బేతంచెర్లలో..

బేతంచెర్ల: పట్టణంలోని సీఎస్‌ఐ, ఆర్‌సీఎం, హోసన్నా మందిరం, సిమెంట్‌నగర్ గ్రామంలోని సీఎస్‌ఐ, తెలుగు బాపిస్టు కృపాలయం చర్చిల్లో పాస్టర్ల ఆధ్వర్యంలో క్రైస్తవులు మట్టల పండుగను జరుపుకున్నారు. మట్టలతో ర్యాలీగా వెళ్లి ఆయా చర్చిల్లో ప్రార్థనలు చేశారు. ప్రతి ఒక్కరూ ఇతరులపై ప్రేమ, దయ, శాంతి కలిగి ఉండాలని పాస్టర్లు పేర్కొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

బేతంచెర్ల: మండల పరిధిలోని కనుమకింది కొట్టాల గ్రామానికి చెందిన బిల్ల రమేష్ శనివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు, చుట్టు పక్కల ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ తెలియలేదు. దీంతో భార్య బిల్ల లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ చెన్నయ్య తెలిపారు.

వేడుకగా చెన్నకేశవుని కల్యాణం



కల్యాణానికి హాజరైన మహిళలు,



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు



హనుమంత వాహనంపై దర్శనమిస్తున్న చెన్నకేశవస్వామి

బేతంచెర్ల: పట్టణంలోని చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం స్వామివారి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఆలయ ఈఓ మద్దిలేటి, పారిశ్రామికవేత్త మారుతి కృష్ణ, భార్గవి దంపతులు ఆధ్వర్యంలో వేదపండితులు నరేష్ శర్మ, శివ నాగేశ్వరశర్మ ఉత్సవ విగ్రహాలను సుందరంగా ముస్తాబు చేశారు. వేదమంత్రాలు, భక్తుల గోవింద నామ స్మరణ నడుమ స్వామివారి కల్యాణం వేడుకగా జరిగింది. మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కల్యాణ్యాన్ని తిలకించారు. సాయంత్రం హనుమంత వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. మేళతాళాలు, భక్తుల నడుమ ఆలయం నుంచి గ్రామ వీధుల్లో ఊరేగింపు సాగింది. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ ఈవీ సుజాత శర్మ, ఆలయ కమిటీ సభ్యులు బుగ్గన శ్రీధర్‌రెడ్డి, గౌరి హుసేన్‌రెడ్డి, బుగ్గన విశ్వనాథ్‌రెడ్డి, అన్నరావు, నాగమోహన్, బూషిరెడ్డి పాల్గొన్నారు.

అంతా నా ఇష్టం

- నడి రోడ్డుపైనే అక్రమ కట్టడం



నడిరోడ్డుపైనే నిర్మాణం చేపడుతున్న దృశ్యం



రోడ్డుపై అక్రమంగా నిర్మించిన గోడ

అవుకు: మండల కేంద్రంలోని వీధిలో ఓ వ్యక్తి నడిరోడ్డుపైనే అక్రమ కట్టడం చేపట్టాడు. అభ్యంతరం తెలిపిన స్థానికులను ఇష్టం వచ్చిన చోట చెప్పుకోండని దబాయించాడు. కాలనీవాసులు తెలిపిన వివరాల మేరకు.. అవుకు పట్టణంలోని ఆంజనేయ స్వామి ఆలయం పక్కన ఉన్న వీధిలో ఓ వ్యక్తి అతని తమ్ముడు పంచాయతీ రోడ్డుపై సుమారు 10అడుగుల పొడవు, 8 అడుగుల వెడల్పుతో నిర్మాణ పనులు చేపట్టారు. కాలనీవాసులు అడ్డుచెప్పడంతో వారిపై దాడికి సైతం యత్నించారు. దీనిపై అవుకు మేజర్ గ్రామ పంచాయతీ ఈఓకు కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. దీంతో గ్రామ పంచాయతీ సిబ్బంది నిర్మాణ పనులు ఆపివేయాలని సూచించారు. వారి మాటలను లెక్క చేయకుండా నిర్మాణ పనులను కొనసాగించారు. మీరు ఎవరికి చెప్పుకున్నా నిర్మాణ పనులు మాత్రం నిలిపివేసే ప్రసక్తేలేదని ఆ ఇద్దరు అన్నాదమ్ములు కాలనీవాసులకు తెగేసి చెప్పారు. అక్రమ నిర్మాణంపై పంచాయతీ ఈఓను వివరణ కోరగా విషయం తన దృష్టికి వచ్చిందని.. ప్రస్తుతం లక్ష్మీ కంబగిరిస్వామి ఉత్సావాల డ్యూటీలో ఉండడంతో తమ సిబ్బంది ద్వారా నిర్మాణ పనులు ఆపివేసే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు.



సంజామల: గురువులతో పూర్వ విద్యార్థులు



కోవెలకుంట్ల: 2011-12 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

ఆత్మీయ సమ్మేళనం



బనగానపల్లె: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

బనగానపల్లె: విద్యార్థి దశలో చేసిన అల్లరి.. ఆటలు..పాటలు.. తుంటరి పనులు గుర్తు చేసుకుంటూ పూర్వ విద్యార్థులు సందడి చేశారు. ఇంటర్మీడియెట్ 1991-93 బ్యాచ్‌కు చెందిన మిత్రులు ఆదివారం బనగానపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కలుసుకున్నారు. 35 ఏళ్ల తర్వాత కలుసుకున్న ఆనందంలో అంతా ఉద్వేగానికి లోనయ్యారు. పాత జ్ఞాపకాలు గుర్తుచేసుకుంటూ ఒకరినొకరు ఆటపట్టిస్తూ మరోమారు విద్యార్థులుగా మారిపోయారు. ఈ సందర్భంగా ఆనాటి అధ్యాపకులు శ్రీరాములు, సీతారమయ్య, శ్రీనివాసులు, క్రిష్టప్ప, రామ్మూర్తి, బషీర్ అహమ్మద్, గురువయ్య(ఆర్‌ఐఓ), విజయలక్ష్మీలను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. గురువయ్య, పూర్వ విద్యార్థులు మద్దయ్య, జగన్నాథ్‌రెడ్డి, షేక్ సుబహాని, రజనీకాంత్‌రెడ్డి, రామమద్దిలేటిరెడ్డి, మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, సుదర్శన్‌రావు పాల్గొన్నారు.

'అపూర్వ' కలయిక

సంజామల: మండల పరిధిలోని పేరుసోముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995-96 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం సందడిగా జరిగింది. సుమారు 30 ఏళ్ల తర్వాత ఒకరినొకరు కలుసుకోవడంతో ఆప్యాయంగా పలకరించుకున్నారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకుని సంతోషంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన అలనాటి గురువులు వెంకటేశ్వర్లు, సర్వేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులు, శ్రీకాంత్, రసూల్, విరోజ్‌రావు, వెంకటరామిరెడ్డి, పుల్లయ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సంజామల వైస్ ఎంపీపీ చిన్నబాబు, గంగుల చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, పుల్లయ్య, హమీద్, మద్దిలేటి, వెంకటేశ్వర్లు, రాజారెడ్డి, రామిరెడ్డి, శివజ్యోతి, రజిత, సావిత్రి, సుజాత పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక

కోవెలకుంట్ల: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. 2011-12 బ్యాచ్ పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఒక వేదికపై చేరారు. అప్పటి జ్ఞాపకాలు, మధుర స్మృతులు, అల్లరి చేష్టలను గుర్తు చేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు రాజయ్య, ఇమ్రాధుల్లా, సుదర్శన్, వెంకటరాముడు, విశ్వనాథ్, శ్రీనివాసరెడ్డి, యుగంధర్, ప్రసాద్, షరీఫ్, పుల్లయ్య తదితరులను సత్కరించారు. పూర్వ విద్యార్థులు సిసింద్రీ, జగన్, భరత్, మనోహర్, నాగార్జున, ఇందిరా కార్యక్రమానికి కో ఆర్డినేటర్లుగా వ్యవహరించారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

డోన్ టౌన్: బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాల కోసం ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 10 గంటల నుంచి 12.30 వరకు ఐదో తరగతి, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకు ఇంటర్ అభ్యర్థులకు పరీక్షలు నిర్వహించారు. ఐదో తరగతిలో 472 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 44 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్‌కు 180 మంది హాజరుకావాల్సి ఉండగా 23 మంది గైర్హాజరయ్యారు. విద్యార్థులు, తల్లిదండ్రులతో పరీక్ష కేంద్రం ప్రాంగణం కిక్కిరిసిపోయింది.



విద్యార్థుల తల్లిదండ్రులతో కిక్కిరిసిన పరీక్ష కేంద్రం